బీసీ బిల్లు ఆమోదం అభినందనీయం

- రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదే
- జిల్లా కాంగ్రెస్ నాయకులు


జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర అసెంబ్లీలో బీసీ కులగణన బిల్లును ఆమోదించి, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం అభినందనీయమని జిల్లా ఓబీసీ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, డీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలితలు అన్నారు. బీసీ కులగణన చేసి బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం తెలిపినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రిమండలికి కాంగ్రెస్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్కలకు ధన్యావాదాలు తెలుపుతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే బీసీలకు న్యాయం జరిగిందన్నారు. దేశంలో కూడా బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ కల్పించే దిశగా ప్రధాని మోదీ ఆలోచన చేయాలని అన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో రిజర్వేషన్ ప్రకారం సీట్లు ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు సంతోష్, శ్రీనివాస్, ప్రమోద్, కోనేరు సాయికుమార్, రేవతి, బింగి మధుసూదన్, పోల ఉష, గాజుల సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మాదిగ జాతి రుణపడి ఉంటుంది

నిజామాబాద్ అర్బన్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన సీఎం రేవంత్ రెడ్డికి మాదిగ జాతి రుణపడి ఉంటుందని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని పూలాంగ్ చౌరస్తా వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకున్నారు.ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే మొదటిసారిగా చట్టబద్ధత తీసుకురావడం ఎంతో సంతోషకరమన్నారు.

ఇందల్వాయిలో కాంగ్రెస్ శ్రేణుల హర్షం

ఇందల్వాయి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కృషి చేస్తుండటం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ సర్కార్ ప్రజా పాలన సాగిస్తుంటే విపక్షాలు విమర్శించడం సరికాదని అన్నారు. మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, నాయకులు సంతోష్ రెడ్డి, ఎల్‌ఐసీ గంగాధర్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్‌లో రన్నర్‌గా జిల్లా జట్టు


రన్నర్‌గా నిలిచిన జిల్లా రిటైర్డు ఉద్యోగులు

నిజామాబాద్‌నాగారం: సూర్యాపేట జిల్లా కోదాడలో ఈ నెల 16 నుంచి 18 వరకు రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా సాహిత్య సాంస్కృతిక ఉత్సవాల్లో జిల్లాకు చెందిన బి.గంగాధర్‌గౌడ్, జాలయ్య(విశ్రాంత ఉద్యోగులు) రన్నర్‌గా నిలిచి కప్ అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి వాసు, కార్యదర్శి కిరణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి సాయరెడ్డి తదితరులు వారిని అభినందించారు.

రాష్ట్రస్థాయి హాకీ టోర్నీలో..


రన్నర్‌గా నిలిచిన జిల్లా పురుషుల జట్టు

నిజామాబాద్‌నాగారం: ఈ నెల 17 నుంచి 19 వరకు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ మెన్ హాకీ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. క్రీడాకారులకు నిజామాబాద్ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, కోశాధికారి పింజ సురేందర్, వైస్ ప్రెసిడెంట్ విద్యాసాగర్ రెడ్డి, రిటైర్డు హాకీ కోచ్ హర్షవర్ధన్ రెడ్డి, తదితరులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌లో..


విజేతగా నిలిచిన బాలికల జట్టు

నిజామాబాద్‌నాగారం: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 ఫుట్‌బాల్ బాలికల టోర్నమెంట్‌లో జిల్లా జట్టు విజేతగా నిలిచింది. క్రీడాకారులను డీఈవో అశోక్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి, తదితరులు ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు.

సినిమా థియేటర్ల తనిఖీ


థియేటర్లను తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఖలీల్ వాడి: నగరంలోని 4వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల సినిమా థియేటర్‌లను తనిఖీ చేసినట్లు బుధవారం ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎవరైనా అనుమానితులు ఉన్నారేమోనని తనిఖీలు చేశామని ఆయన చెప్పారు.

శాఖా గ్రంథాలయం..


రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న సంస్థ చైర్మన్

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలోని శాఖా గ్రంథాలయాన్ని నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయ నిర్వహణను పరిశీలించారు. లైబ్రేరియన్ వాణిని అడిగి గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాల వివరాలను తెలుసుకున్నారు. సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. ఖిల్లా రామాలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య లైబ్రరీలో విద్యార్థుల కోసం మరిన్ని పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలని కోరారు.

యూనియన్ల విలీన సభను విజయవంతం చేయండి

డిచ్‌పల్లి: తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ), తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రెండూ విలీనం అవుతున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి జేపీ గంగాధర్ తెలిపారు. బుధవారం డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లిలో విలీన సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేపీ గంగాధర్ మాట్లాడుతూ.. ఈ నెల 27న ఘన్‌పూర్‌లోని కల్యాణ మండపంలో విలీన సభ జరుగుతుందన్నారు.

నేటి నుంచి ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు


విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆలయం

మోపాల్: నర్సింగ్‌పల్లిలో గల ఇందూరు తిరుమల క్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి 11వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. త్రిదండి రామానుజచిన్నజీయర్‌స్వామివారి మంగళశాసనాలతో దేవనాథ రామానుజ స్వామి ప్రత్యేక్ష పర్యవేక్షణ, గంగోత్రి ఆచార్య రామానుజ దాసు స్వామి సహ పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. భక్తులు సకుటుంబ, సపరివార సమేతంగా బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివార్ల కృపకుపాత్రులు కావాలని మాపల్లె చారిటబుల్‌ట్రస్టు ప్రతినిధి నర్సింహారెడ్డి తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి ఇప్పటికే ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఏఆర్ హెడ్ క్వార్టర్స్ తనిఖీ



ఖలీల్ వాడి: నిజామాబాద్లోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌ను సీపీ పోతరాజు సాయిచైతన్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌ని డాగ్ స్క్వాడ్, లైబ్రరీ, స్పెషల్ పార్టీ, జిమ్ తదితర విభాగాలను పరిశీలించారు. రిజర్వ్ సీఐలు తిరుపతి, శ్రీనివాస్, సతీష్, శేఖర్ తదితరులున్నారు.

సాయంత్రం ఇఫ్తార్ విందులో..
నగరంలోని ఒకటవ టౌన్ పరిధిలోని కచ్చియా మసీదులో బుధవారం సాయంత్రం ఇఫ్తార్ విందులో సీపీ పోతరాజు సాయిచైతన్య పాల్గొన్నారు. ఆయనతో పాటు ఏసీపీ రాజా వెంకట్రామ్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో రఘునాథ్, మత పెద్దలు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తో యువతకు ఉద్యోగాలు


కిట్లు అందజేస్తున్న చైర్మన్ రాజిరెడ్డి

నిజామాబాద్ అర్బన్: కమ్యూనికేషన్ స్కిల్స్‌తో యువత ఉద్యోగాలు త్వరగా పొందవచ్చునని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. బుధవారం ఎల్లమ్మ గుట్ట రెడ్డీస్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి యువతీయువకులకు కిట్స్ అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ.. కంప్యూటర్, ఆంగ్ల భాష తదితర అంశాలపై రెడ్డీస్ సంస్థ ఉచితంగా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థ ప్రతినిధులను అభినందించారు. సంస్థ ప్రతినిధులు అజీం, శ్రీపాల్, సాయి కాంత్ తదితరులు పాల్గొన్నారు.

సిరి లేఖలు పుస్తకావిష్కరణ



నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలంలోని సిరిపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రచించిన లేఖల సంకలనం 'సిరి లేఖలు' పుస్తకాన్ని బుధవారం డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మక రంగంలో రాణించడం సంతోషదాయకమన్నారు. సిర్పూర్ విద్యార్థులు ఒక అడుగు ముందుకేసి లేఖల రూపంలో తమ ఆలోచనలను పంచుకోవడం అభినందనీయమన్నారు. ఈ విద్యార్థులకు మార్గదర్శిగా వ్యవహరిస్తున్న తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ కాసర్లను అభినందించారు. డీసీసీబీ సెక్రెటరీ సీతయ్య, గణిత ఫోరం బాధ్యులు కె. కాంతారావు, పుస్తక రూపకర్త చింతల శ్రీనివాస్ గుప్తా, ఉపాధ్యాయులు, పుస్తక సంపాదకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో అన్ని రంగాలకు అన్యాయం


మాట్లాడుతున్న ప్రభాకర్

సిరికొండ: రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని రంగాలకు అన్యాయం జరిగిందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి.ప్రభాకర్ ఆరోపించారు. గడ్కోల్‌లో పార్టీ డివిజన్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడ్జెట్ తెలంగాణ ప్రజల మోచేతికి బెల్లం పెట్టినట్లు ఉందని ఎద్దేవా చేశారు. వ్యవసాయరంగం పట్ల తీవ్ర వివక్ష కనపడుతోందని విమర్శించారు. నాయకులు రామకృష్ణ, దేవరాం, రమేష్, గోదావరి, నరేందర్, సురేష్, ముత్తెన్న, తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రం అందజేత



సుభాష్ నగర్: నిజామాబాద్ డీసీసీబీ కార్యాలయంలో చైర్మన్ కుంట రమేష్ రెడ్డి బుధవారం రాజేశ్వరికి కారుణ్య నియామక పత్రాన్ని అందజేశారు. బ్యాంకు ప్రధాన కార్యాలయంలో స్టాఫ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ కొన్ని రోజుల కింద అనారోగ్య కారణాల వల్ల మృతి చెందారు. ఆమెను స్టాఫ్ అసిస్టెంట్‌గా నియమిస్తూ చైర్మన్ నియామక పత్రాన్ని అందజేశారు. ఉపాధ్యక్షుడు నల్ల చంద్రశేఖర్ రెడ్డి, మార్క్ ఫెడ్ రాష్ట్ర అధ్యక్షుడు మార గంగారెడ్డి, డైరెక్టర్ లింగన్న, సీఈవో నాగభూషణం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


సీతాయిపేట్‌లో పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధర్పల్లి: మండల కేంద్రంలో మంజూరైన రెండు ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ బాలరాజ్, నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఒక్కొక్క ఆరోగ్య ఉప కేంద్రానికి రూ.20 లక్షలు మంజూరైనట్లు వారు తెలిపారు. అనంతరం సీతాయిపేట్‌లో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.

తెలంగాణ యూనివర్సిటీకి ఈశ్వరీబాయి పేరుపెట్టాలి


వినతి పత్రం ఇస్తున్న దళిత సంఘాల నేతలు

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ విశ్వవిద్యాలయానికి తెలంగాణ తొలిదశ పోరాట యోధురాలు ఈశ్వరీబాయి పేరుపెట్టి రాష్ట్ర ప్రభుత్వం గౌరవించాలని దళిత ప్రజాసంఘాల జేఏసీ నేతలు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్‌కు వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ..ఈశ్వరీబాయి పేరును పెట్టి గౌరవించే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించాలన్నారు. నాయకులు చిట్టేటి మోహన్ రావు, నాంది వినయ్, బత్తుల కిష్టయ్య, సీహెచ్ వెంకటరమణ, అబ్బి ప్రగతి, అంగరి ప్రదీప్, తర్ల లక్ష్మణ్, షెట్పల్లి నారాయణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీకి బస్సుల సంఖ్య పెంచండి


వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నేతలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్‌కు ప్రస్తుతం ఒకే బస్సు వస్తోందని, విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బస్సుల సంఖ్య పెంచాలని ఏబీవీపీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం తెయూ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఆర్టీసీ డిపో -1 మేనేజర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృత్‌చారి మాట్లాడుతూ.. వర్సిటీకి బస్సుల సంఖ్య పెంచడంతో పాటు మూడు పూటలు రాకపోకలు సాగించేలా చూడాలని కోరారు. ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ శశి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోహన్, దుర్గాదాస్ పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం మహిళలకు స్ఫూర్తి



నివాళులర్పిస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: సమ సమాజ స్థాపన కోసం ప్రజా పోరాటాలు చేసిన యోధురాలు మల్లు స్వరాజ్యంను మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్‌బాబు మాట్లాడుతూ.. దోపిడీలేని సమాజ నిర్మాణం కోసం మల్లు స్వరాజ్యం పోరాడారన్నారు. నాయకులు ఆనందాచారి, పెద్ది వెంకట్ రాములు, కటారి రాములు, అనిత పాల్గొన్నారు.

ఆశాలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాల్సిందే


జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

నిజామాబాద్ సిటీ: ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాల్సిందేనని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో ఆశ వాలంటీర్లు ఆందోళన నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో రాజశ్రీకి వినతిపత్రం సమర్పించారు. వారికి సీపీఎం మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. ఐఏఎస్ అధికారి ఆధ్వర్యంలో కమిటీ వేసి ఆశాల సమస్యలు పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన హామీలు చేయకపోతే ఈనెల 24న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోయనీయకండి


వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

డిచ్‌పల్లి: వరి పంట, మొక్కజొన్న కోతలు కోసిన తర్వాత ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయకుండా చర్యలు తీసుకోవాలని డిచ్‌పల్లి చేయూత సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం సంఘం సభ్యులు డిచ్‌పల్లి సొసైటీ సీఈవో కిషన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వడ్లు, మక్కలను రోడ్లపై ఆరబోయడంతో గతంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన ఘటనలు జరిగాయన్నారు. వాటిని దృష్టిలో ఉంచుకుని రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని విన్నవించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,700	వెండి(కిలో)	1,04,500
22 క్యారెట్స్	83,712		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	50	75
బీరకాయ	40	70	దోసకాయ	30	50
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
జిల్కసుకాయ	30	50	గోబిగడ్డ	10	20
కాకరకాయ	40	60	గోబిపువ్వు	10	20
వంకాయ	10	20	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	60	110
మెంతికూర	30	50	చామగడ్డ	50	75
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	80	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	30	50			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్-1 దిల్‌రూబా-11.00,4.35,7.30, 10.25 -ఛావా(హిందీ)-1.40
స్క్రీన్-2 యుగానికి ఒక్కడు -11.00, 4.40 కోర్ట్ -1.45, 7.35, 10.30
స్క్రీన్-3 ఆఫీసర్ ఆన్ డ్యూటీ -1.30,7.30 ఛావా -4.30, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1 ఛావా -10.00, 4.15 ఆఫీసర్ ఆన్ డ్యూటీ -1.20 కోర్ట్ -7.35, 10.40
స్క్రీన్-2 కోర్ట్ -10.00, 4.25 ఛావా -1.05, 7.30 ఛావా(హిందీ)-10.50
స్క్రీన్-3 ఛావా(హిందీ)-10.30, 1.50 ల్యాంప్ -5.10 రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ -7.35 యుగానికి ఒక్కడు -10.45
స్క్రీన్ -4 దిల్‌రూబా -10.15, 4.10,7.20,10.30 1000 వాలా -1.25

లలితామహల్ కోర్ట్ (తెలుగు)
దేవి దిల్‌రూబా(తెలుగు)
నటరాజ్ యుగానికి ఒక్కడు (తెలుగు)
విజయ్ ఛావా (తెలుగు)

సంక్షిప్తం

బడ్జెట్ పత్రాల దహనం
నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అతి తక్కువ నిధులు కేటాయించిందని నిరసిస్తూ పీడీఎస్‌యు ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాలలో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ మాట్లాడారు. అధికారంలోకి రాగానే 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి తన హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు.

న్యూసెన్స్ కేసులో జైలుశిక్ష
ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో న్యూసెన్స్ చేసిన ఆనంద్ నగర్‌కు చెందిన రాహుల్ సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు బుధవారం ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రాహుల్ సింగ్‌ను మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా నాలుగు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

న్యూఢిల్లీలో ఎల్‌ఐసీ ఏజెంట్ల ధర్నా
సిరికొండ: సమస్యల పరిష్కారం కోసం దేశ రాజధాని న్యూఢిల్లీలో చేపట్టిన ధర్నాలో మండలానికి చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్లు పాల్గొని నిరసన తెలియజేశారు. ఎల్‌ఐసీ ఏజెంట్ల జోనల్ కమిటీ సభ్యులు తూంపల్లి శ్రీనివాస్, ఆర్మూర్ శాఖ ప్రధాన కార్యదర్శి వడ్ల బాలయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం
నిజామాబాద్‌నాగారం: గురు రాఘవేంద్ర సన్‌రైజ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి(నిజామాబాద్) ఆధ్వర్యంలో బర్ధిపూర్‌లో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. గ్రామ కార్యదర్శి కె వసంత్‌రావు, మాజీ సర్పంచ్ పద్మారావు, డాక్టర్ తరుణ్‌కుమార్, ఆస్పత్రి అడ్మిన్ శివ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి
డిచ్‌పల్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని డిచ్‌పల్లి పోలీసులు సూచించారు. బుధవారం పోలీసులు ఘన్‌పూర్‌లో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోతే జరిగే అనర్థాల గురించి వివరించారు. అలాగే మైనర్ డ్రైవింగ్‌పై ..అనంతరం డిచ్‌పల్లి బస్టాండ్ వద్ద సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పరీక్షలంటే భయం వీడాలి


పరీక్షల అట్టలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

డిచ్‌పల్లి: విద్యార్థులు పరీక్షలు అంటే భయం వీడాలని, ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పదో తరగతి పరీక్షలు రాయాలని డిచ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సీతయ్య సూచించారు. బుధవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లతో పాటు ప్రోత్సాహకాలను అందజేశారు. పరీక్షలకు అవసరమైన సలహాలు, సూచనలిచ్చారు. విద్యార్థులకు పెన్నులు, పరీక్ష అట్టలు అందజేసి మంచి గ్రేడ్ సాధించాలని ఆకాంక్షించారు.